పుదువై, కారైక్కాల్‌కు
భారీవర్ష సూచన

- శని,ఆదివారాల్లో ప్రజలు బయటకు రావొద్దు
- కలెక్టర్ కులోత్తుంగన్



సమావేశంలో మాట్లాడుతున్న పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తుంగన్

పుదుచ్చేరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక సమీపాన నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ పుదుచ్చేరి, కారైక్కాల్ సమీపిస్తున్న కారణంగా శని, ఆదివారాల్లో ప్రజలు బయటకు రావొద్దని పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తుంగన్ హెచ్చరించారు. దిత్వా ముంచుకొస్తుండటంతో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో భారీవర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. వరద నివారణ పనులకు రాణిపేట జిల్లా అరక్కోణం నుండి 60 మందితో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు శుక్రవారం పుదుచ్చేరి చేరుకున్నాయి. ఇదిలా వుండగా, తుఫాను వల్ల ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తరుపున చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యల గురించి పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తుంగన్ పోలీసు, విపత్తుల నివారణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారీవర్షం కురిసే అవకాశమున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం 312 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శని,ఆదివారాల్లో ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని ఆయన హెచ్చరించారు. భారత వాతావరణ పరిశోధనా కేంద్రం తమ రాష్ట్రానికి రెడ్ అలర్ట్ జారీచేసిందని, సుమారు 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని ప్రకటించిందని, ఇందువల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా నివారణ పనులను ముమ్మరం చేసినట్లు తెలిపారు. 24 గంటలు పని చేసే కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని, వరదకు సంబంధించిన సమాచారాన్ని 112, 1070, 1077 అనే టోల్‌ఫ్రీ నెంబర్లను సంప్రదించి తెలియజేయవచ్చని, మత్స్యకారులు ప్రభుత్వ అనుమతిలేకుండా సముద్రంలోకి చేపలవేటకు వెళ్లరాదని కలెక్టర్ కులోత్తుంగన్ హెచ్చరించారు.

రేపు చెన్నై సమీపంలో
తీరం దాటనున్న దిత్వా

- రాష్ట్రానికి 2 రోజుల భారీ వర్షసూచన
- నేడు 6 జిల్లాలకు రెడ్ అలర్ట్
- అప్రమత్తంగా ఉండండి ప్రభుత్వ యంత్రాంగానికి సీఎం ఆదేశం


రామేశ్వరంలో అల్లకల్లోలంగా సముద్రం

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఆగ్నేయ శ్రీలంక తీరం దిశగా నెలకొన్న వాయుగుండం 'దిత్వా' తుఫానుగా మారి నగరానికి చేరువగా తీరం దాటే అవకాశం ఉందని స్థానిక వాతావరణ కేంద్రం అధికారులు అంచనావేశారు. ఈ తుఫాను కారణంగా తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, కడలూరు, విల్లుపురం, చెంగల్పట్టు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ ఆరు జిల్లాల్లో శనివారం భారీ వర్షం కురుస్తుందన్నారు. శుక్రవారం రాత్రి ఆ తుఫాను నగరానికి 370 కి.మీల దూరంలో ఉందని, ఆదివారం వేకువజాము దక్షిణాంధ్ర, ఉత్తర తమిళనాడు మధ్య తీరం దాటుతుందని పేర్కొన్నారు. ఈ తుఫాను ప్రభావం కారణంగా రెడ్ అలర్ట్ జారీ అయిన తంజావూరు, తిరువారూరు, పుదుకోట, రామనాధపురం జిల్లాల్లో శుక్రవారం భారీగా వర్షం కురిసింది. శనివారం డెల్టా జిల్లాలైన తంజావూరు, తిరువారు, పుదుకోట జిల్లాలతోపాటు రామనాథపురం, తూత్తుకుడి, విరుదునగర్, మదురై జిల్లాల్లోనూ చెదురుమదురుగా వర్షం కురుస్తుందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు.

చెన్నై, కాంచీపురం జిల్లాల్లో...

చెన్నై, కాంచీపురం సహా 9 జిల్లాల్లో శనివారం ఓ మోస్తరు నుండి భారీగా వర్షం కురుస్తుందని అధికారులు పేర్కొన్నారు. తంజావూరు, అరియలూరు, పెరంబలూరు, తిరువణ్ణామలై, వేలూరు, రాణిపేట జిల్లాల్లో పలు ప్రాంతాల్లో కుండ పోతగా వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈ నెల 30న తిరువళ్లూరు, చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు. నగరంలో శుక్రవారం ఉదయం నుండే ఆకాశం మేఘావృతమైంది. కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. చలి గాలులు కూడా ఎక్కువయ్యాయి.

బోసిపోయిన రామేశ్వరం...

మూడు రోజులుగా కురిసిన వర్షం కారణంగా సుప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం రామేశ్వరం భక్తులు లేక బోసిపోయింది. ఇదే విధంగా రామేశ్వరం చుట్టూ ఉన్న ధనుష్కోడి తదితర ప్రాంతాలకు కూడా పర్యాటకుల సందడి తగ్గింది. ధనుష్కోడి, అరిచ్చల్‌మునై సముద్ర తీర ప్రాంతాల్లో గంటలకు 65 నుండి 70 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీయడంతో ఆ ప్రాంతాల్లో పర్యాటకుల సంచారంపై అధికారులు నిషేధం విధించారు. కాగా శుక్రవారం రామేశ్వరంలో సముద్రం అల్లకల్లోలంగా కనిపించింది. దీంతో తీరప్రాంత ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

డెల్టా జిల్లాలకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు...

దిత్వా తుఫాను హెచ్చరిక నేపథ్యంలో, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో చేపట్టనున్న సహాయక చర్యల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పాల్గొననున్నాయి. రాష్ట్రప్రభుత్వ సూచనల మేరకు అరక్కోణం నుండి శుక్రవారం మధ్యాహ్నం తంజావూరు, నాగపట్నం, మైలాడుదుర్తై, పుదుకోట, కడలూరు, తిరువారూర్ అనే ఆరు డెల్టా జిల్లాలకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వెళ్లాయి.

సహాయ చర్యలను ప్రారంభించండి: స్టాలిన్

'దిత్వా' ప్రభావం కారణంగా భారీగా వర్షం కురిసే అవకాశమున్న జిల్లాల్లో కలెక్టర్లు ముందస్తు సహాయ చర్యలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇదే విధంగా ఆయా జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌లుగా ఉన్న రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు వర్ష బాధితులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలవారిని ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సురక్షిత శిబిరాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. తూత్తుకుడి, తిరువళ్లూరు, మైలాడుదుర్తై, పుదుకోట, నాగపట్టినం, తిరువారూరు, కాంచీపురం సహా 14 జిల్లాలకు చెందిన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సహాయక చర్యలను తెలుసుకున్నారు.

నేడు స్కూళ్లు, కళాశాలలకు సెలవు

'దిత్వా' ప్రభావంతో భారీగా వర్షం కురవనుండటంతో శనివారం పుదుచ్చేరి, కారైక్కల్ సహా ఏడు జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో సెలవు ప్రకటించిన జిల్లాల వివరాలు... కడలూరు, కళ్లకురిచ్చి, తిరువారూరు, నాగై, మైలదుత్తురై ఉన్నాయి. కాగా పుదుచ్చేరిలో శనివారం అన్ని విమాన సేవలను రద్దు చేశారు.

గౌరవప్రదమైన రాజకీయాలు చేస్తున్నాం

రాజకీయ ప్రత్యర్థుల పేర్లపై ఉన్న సంస్థలపై డీఎంకే ప్రభుత్వం ఎప్పుడూ వివక్ష ప్రదర్శించదు : సీఎం స్టాలిన్


విశ్వవిద్యాలయం ఛాన్సలర్ హోదాలో విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రత్యర్థుల పేర్లపై ఉన్న విద్యా సంస్థలు, ప్రభుత్వ సంస్థలపై డీఎంకే ప్రభుత్వం ఎప్పుడూ వివక్ష ప్రదర్శించదని, గౌరవప్రదమైన రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. చేపాక్ కలైవానర్ అరంగంలో శుక్రవారం ఉదయం జరిగిన డా. జె.జయలలిత సంగీత లలిత కళల విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఛాన్సలర్ హోదాలో పాల్గొని ప్రముఖ తమిళ సినీ నటుడు శివకుమార్, ప్రముఖ చిత్రకారుడు చంద్రూకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. ఆ విశ్వవిద్యాలయంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఆ సందర్భంగా ఆయన స్నాతకోత్సవ ప్రసంగం చేస్తూ... మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత పేరుపై ఉన్న ఈ విశ్వవిద్యాలయం విషయంలో తామెలాంటి వివక్ష చూపలేదని, స్నాతకోత్సవాన్ని బహిష్కరించలేదని, ఇంకా చెప్పాలంటే 2021 తర్వాత ఈ విద్యా సంస్థ మరింత సుసంపన్నం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ విశ్వవిద్యాలయం అభివృద్ధికి మరింత నిధులు సమకూర్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని, ఇలాంటి రాజకీయ పరస్పర సమున్నత గౌరవాన్నే తాను కోరుకుంటున్నానని చెప్పారు. ఈ సంగీత లలిత కళల విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఛాన్సలర్‌గా, ముఖ్యమంత్రిగానే కాకుండా తాను కూడా రంగస్థల, సినీ కళాకారుడిగాను ఈ సభలో పాల్గొంటున్నానని చెప్పారు. తన చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించిన నటుడు శివకుమార్ మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి అత్యంత ప్రీతిపాత్రుడని, కొవిడ్ సమయంలో శివకుమార్ ఆయన కుమారులు నటులు కార్తీ, సూర్య కోటి రూపాయల విరాళాన్ని అందించి దాతృత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. చిత్రకారుడు చంద్రూ కూడా పురావస్తు పరిశోధన విభాగంలో పనిచేశారని, ఆయన చిత్రీకరించిన బొమ్మలన్నీ సజీవ చిత్రాలని స్టాలిన్ పేర్కొన్నారు. సంగీతం, ఇతర కళలను చక్కగా అభ్యసించి తన చేతుల మీదుగా పట్టాలు స్వీకరించిన విద్యార్థులందరూ అభినందనీయులు' అని తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో ప్రో ఛాన్సలర్, మంత్రి ఎంపీ సామినాథన్, మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాసామి, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధ్యక్షులు పూచ్చి మురుగన్, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. సి.సౌమ్య, రిజిస్ట్రార్ పూమాలిని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ముత్తుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ హాకీ ఆటగాళ్ల కోసం
5న మదురైలో జల్లికట్టు


జల్లికట్టు స్టేడియంను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మదురై రేస్‌కోర్స్ అంతర్జాతీయ హాకీ స్టేడియంలో జరిగే ప్రపంచ జూనియర్ హాకీ పోటీలకు విచ్చేసిన విదేశీ ఆటగాళ్ళ కోసం డిసెంబర్ 5న మదురైలోని కీళ్‌కరై కలైంజర్ జల్లికట్టు స్టేడియంలో జల్లికట్టు పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలను తిలకించడానికి ఆటగాళ్లు ఎద్దులబండ్లలో తమిళ సంప్రదాయ దుస్తులు ధరించి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. అలంగానల్లూర సమీపంలోని కీళ్‌కరై గ్రామంలోని జల్లికట్టు స్టేడియంలో ప్రతియేటా అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూరు జల్లి క్రీడలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మదురై రేస్‌కోర్స్ మైదానంలో అంతర్జాతీయ జూనియర్ హామీక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు విచ్చేసిన విదేశీ హాకీ ఆటగాళ్ళ కోసం మదురై సంప్రదాయిక ప్రాచీన సాహసక్రీడ జల్లికట్టు పోటీలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పర్యాటకశాఖ సిద్ధమయ్యాయి. ఈ విషయమై జల్లికట్టు మైదానం మేనేజర్ విఘ్నేష్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ హాకీ ఆటగాళ్ళకు మదురై నగర సంస్కృతీ సంప్రదాయాలను, కళలను తెలిపేలా డిసెంబర్ 5న జల్లికట్టు క్రీడను జరుపనున్నామని, ఆ పోటీల్లో 50 జల్లికట్టు ఎద్దులు పాల్గొంటాయని తెలిపారు.

కండక్టర్‌పై లా విద్యార్థిని చెప్పుతో దాడి

- రవాణా కార్మికుల ధర్నా


కీలాంబాక్కం బస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న కండక్టర్లు, డ్రైవర్లు

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కిలాంబాక్కం సమీపంలో ఎంటీసీ బస్సు కండక్టర్‌పై చెప్పుతో దాడికి పాల్పడిన లా కాలేజీ విద్యార్థినిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ బస్‌స్టేషన్‌లో డ్రైవర్లు, కండక్టర్లు ధర్నాకు దిగారు. మద్రాస్ హైకోర్టు సమీపంలోని బ్రాడ్‌వే బస్‌స్టేషన్ నుండి కీలాంబాక్కంకు గురువారం రాత్రి బయలుదేరిన సిటీబస్సులో లా విద్యార్థిని తాంబరం వరకు టికెట్టు తీసుకుని ఆ స్టాప్‌లో దిగలేదు. గమనించిన కండక్టర్ బస్సు తాంబరం దాటినందు వల్ల అదనంగా రూ.15 టికెట్టు తీసుకోవాలని కోరడంతో అందుకు ఆమె నిరాకరించి కండక్టర్‌తో వాగ్వివాదానికి దిగింది. వారి మధ్య మాటామాటా పెరిగి అసభ్యపదజాలంతో ఒకరినొకరు దూషించుకున్నారు. ఈ నేపథ్యంలో, కోపంతో ఆ విద్యార్థిని చెప్పుతో కండక్టర్‌పై దాడికి పాల్పడింది. ఇదిలా వుండగా, ఆ బస్సు కీలాంబాక్కం బస్‌స్టేషన్‌కు చేరుకోగా, కండక్టర్ తనకు జరిగిన అవమానం గురించి అక్కడున్న డ్రైవర్లు, కండక్టర్లకు తెలియజేశారు. దీంతో కండక్టర్‌పై దాడి చేసిన విద్యార్థినిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డ్రైవర్లు, కండక్టర్లు ధర్నాలో పాల్గొన్నారు. ఇదిలా వుండగా, విద్యార్థిని, కండక్టర్ వేర్వేరుగా కీలాంబాక్కం పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

5న జయ వర్ధంతి

- అన్నాడీఎంకే ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 9వ వర్ధంతిని పురస్కరించుకుని అన్నాడీఎంకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో 2016 డిసెంబరు 5న అప్పటి ముఖ్యమంత్రి జయలలిత అనారోగ్యం కారణంగా మరణించారని, ఆమె భౌతికంగా దూరమైనా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని కొనియాడారు. జయ 9వ వర్ధంతి సందర్భంగా వచ్చే నెల 5వ తేదీ ఉదయం మెరీనా బీచ్‌లో ఉన్న ఆమె స్మారక మందిరంలో పుష్పాంజలి ఘటించనున్నట్లు తెలిపారు. వర్ధంతి సందర్భంగా అన్ని జిల్లాల్లో పార్టీ నిర్వాహకులు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

విమానాశ్రయం చుట్టుపక్కల స్థలాలను తీసుకోం

ఎయిర్‌పోర్టు సలహా సంప్రదింపుల కమిటీ చైర్మన్, ఎంపీ టీఆర్ బాలు



చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయం విస్తరణ కోసం ఆ చుట్టుపక్కల స్థలాలను సేకరించే ప్రసక్తే లేదని డీఎంకే ఎంపీ టీఆర్ బాలు ప్రకటించారు. చెన్నై విమానాశ్రయ సలహా సంప్రదింపుల కమిటీ సమావేశం ఆ విమానాశ్రయ డైరెక్టర్ రాజ్ కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ టీఆర్ బాలు, కమిటీ సభ్యులు పల్లావరం ఎమ్మెల్యే ఇ.కరుణానిధి, తాంబరం ఎమ్మెల్యే ఎస్ఆర్ రాజా, మాజీ ఎమ్మెల్యే వైద్యలింగం తదితర అధికారులు హాజరయ్యారు. సమావేశం అనంతరం టీఆర్ బాలు మీడియాతో మాట్లాడుతూ.. చెన్నై ఎయిర్‌పోర్ట్ లోపలకు ప్రస్తుతం బస్సులు తిరుగుతుండటంతో విమానా ప్రయాణికులు సులువుగా తమ గమ్యస్థానాలకు వెళ్లగలుగుతున్నారని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ నుండి కిలాంబాక్కం వరకు మెట్రోరైలు నడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. విమానంలో నుంచి దిగి ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌కు చేరటానికి 40 నిమిషాలు పడుతున్నట్లు పలువురు ప్రయాణికులు తెలిపారని, ఆ విషయమై సమావేశంలో చర్చించామని, టెర్మినల్ చేరటానికి పట్టే సమయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ చుట్టూ ఉన్న కౌల్‌బజార్, పోయిచ్చనల్లూరు, అనకాపుత్తూరు తదితర ప్రాంతాల్లో విమానాశ్రయ విస్తరణ కోసం స్థలాలను సేకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చెన్నై ఎయిర్‌పోర్ట్ విస్తరణలో భాగంగానే పరందూరులో రెండో విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. "జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు సంబంధించిన వివరాలను తమిళంలో ప్రకటన చేయాలని విమానాశ్రయ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశానని, త్వరలోనే విమానాల రాకపోకలపై తమిళంలో ప్రకటనలు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని టీఆర్ బాలు పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలకు అడ్డాగా పుళల్ జైలు!



చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి దూరంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమనున్న పుళల్ సెంట్రల్ జైలు మాదక ద్రవ్యాల అడ్డాగా మారింది. రాష్ట్రంలో ఇటీవల కాలంలో మాదకద్రవ్యాల వాడకం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా పలువురు కాలేజీ విద్యార్థులు ఈ మాదకద్రవ్యాల మత్తులో జోగుతున్నారు. ఈ పరిస్థితుల్లో మాదక ద్రవ్యాల అక్రమరవాణా, వినియోగాన్ని నిరోధించేందుకు ప్రత్యేక నిఘా కమిటీని ఏర్పాటు చేశారు. తిరువళ్లూరు జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లా ఈ కమిటీకి నాయకత్వం వహిస్తున్నారు. ఈ కమిటీ సభ్యులంతా తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు తదితర జిల్లాలో మాదకద్రవ్యాల స్మగ్లర్లు, జైలు నుండి విడుదలయ్యే మాజీ నేరస్థుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఫలితంగా అక్టోబర్‌లో మునీర్, జావీద్ అనే ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి భారీ స్థాయిలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ తరచూ ముంబయి వెళ్ళి అక్కడ మాదక ద్రవ్యాలను కొని బెంగళూరు, చెన్నైతోపాటు రాష్ట్రంలోని పలు నగరాలకు వాటిని గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేశారని వెల్లడైంది. దీంతో వారిద్దరికీ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాతో సంబంధాలుంటాయని అనుమానించారు. వారిని విచారించి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పేరొంది. నృత్య కళాకారుడు శిబిరాజ్, నామక్కల్ జౌళి వ్యాపారం చేస్తున్న నైజీరియాకు చెందిన మైఖేల్ నవాసానంటి, చెన్నైలో బసచేస్తున్న కాంగో దేశానికి చెందిన కబితా యానిక్ తిషింబోను అరెస్టు చేశారు. ఆ తర్వాత ఈ మాదక ద్రవ్యాల ముఠాతో సంబంధం ఉన్న సెనెగల్ దేశానికి చెందిన పెండే అనే వ్యక్తిని ఢిల్లీలో అరెస్టు చేశారు. వీరి వద్ద జరిపిన విచారణలో దిగ్భ్రాంతి కరమైన వివరాలు వెలడైనట్లు సమాచారం. మాదక ద్రవ్యాల అమ్మకం కేసులో అరెస్టయిన వారంతా పుళల్ సెంట్రల్ జైలులో ఉంటూనే రాష్ట్రమంతటా మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు పాల్పడినట్లు గుర్తించారు. ఆ జైలులో ఉన్న విదేశీ నేరస్థులతో మాదక ద్రవ్యాలను విక్రయించే ముఠా సభ్యులు సంబంధాలు ఏర్పరచుకునేవారని, ఆ తర్వాత జైలు నుంచి విడుదలైన విదేశీ నేరస్థులు భారీ యెత్తున మాదక ద్రవ్యాలను కొనుగోలు చేసి, జైలులో ఉన్న స్థానిక నేరస్థుల ఆదేశాల ప్రకారం వాటిని రాష్ట్ర మంతటా విక్రయించేవారని తెలిసింది. మొత్తానికి సెంట్రల్ జైలు మాదక ద్రవ్యాల అడ్డాగా మారినట్లు చెబుతున్నారు. ఇటీవల మాదక ద్రవ్యాల స్మగ్లర్లకు చెల్లించిన నగదును పశ్చిమ బెంగాల్, నాగాలాండ్, మిజోరామ్‌కు చెందిన వ్యక్తుల బ్యాంక్ ఖాతాలకు జమ అయినట్లు కూడా ఈ నిఘా కమిటీ గుర్తించింది.. నగదు చేతికందిన కొద్ది గంటలలోపే కోరుకున్న గంజాయి కోరుకున్న ప్రాంతానికి తరలించేవారని తెలిసింది. స్మగ్లింగ్ ముఠాలో ఉన్న సభ్యులకు ముందు అంతర్జాతీయ స్మగ్లర్లతో సంబంధాలుండేవి కావని, ప్రస్తుతం ఢిల్లీ, ముంబాయి, బెంగళూరు, మిజోరామ్, పశ్చిమ బెంగాల్ అంటూ దక్షిణాది రాష్ట్రాల్లోనూ డిజిటల్ విధానంలో మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నారని తెలిసింది. పుళల్ సెంట్రల్ జైలు పక్షుల ద్వారానే ఈ భారీ నెట్‌వర్క్ ద్వారా మాదక ద్రవ్యాలను అడ్డూ అదుపూ లేకుండా తరలిస్తున్నట్లు కనుగొన్నారు. రాష్ట్ర మంతటా జైలు నుంచే వీరంతా జారీ చేసే ఆదేశాల ప్రకారం మాదక ద్రవ్యాలను కోరుకున్న ప్రాంతానికి తరలించేవారని ప్రత్యేక దళం విచారణలో వెల్లడైంది.

సమాచార దర్శిని

30న వ్యాసర్పాడిలో వైద్యశిబిరం

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై ఎస్పీఆర్ ఆధ్వర్యంలో ఈ నెల 30న వ్యాసర్పాడి సత్యమూర్తినగర్ సెయింట్ ఆంథోని చర్చి ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరం జరగనుంది. అపోలో ఆస్పత్రి, శంకర్ నేత్రాలయ, డాక్టర్ గుప్తా డెంటల్ స్పెషాలిటీ సెంటర్ సహకారంతో వచ్చే ఆదివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందని క్లబ్ ఛైర్మన్ మహ్మద్ అమాన్, కార్యదర్శి ఎ.శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ సయ్యద్ ఇబ్రహీంలు ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు 'నలం కాక్కుం స్టాలిన్' శిబిరం

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌లో శుక్రవారం 'నలం కాక్కుం స్టాలిన్' ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... జీసీసీ పరిధిలోని 15 మండలాల్లో 'నలం కాక్కుం స్టాలిన్' పేరుతో ఆగస్టు 2న ప్రత్యేక శిబిరాలను ప్రారంభించి, ఇప్పటివరకు 8 మండలాల్లో నిర్వహించామన్నారు. 9వ వైద్య శిబిరంగా తిరువొత్తియూర్ మండలం శ్రీరామ్ దయాళ్ కెమ్కా వివేకానంద విద్యాలయ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహిస్తున్నామన్నారు.

వైద్య విశ్వవిద్యాలయంలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు డా.ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయంలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వర్సిటీలో జన్యు వైద్యం, ప్రకృతి వైద్యం, యోగా, ఆయుర్వేద విభాగాల్లో ఒక్కొక్క ప్రొఫెసర్ పోస్టు, ప్రయోగాత్మక వైద్యం, అంటు వ్యాధులు, రోగనిరోధక శాస్త్రం, జన్యు వైద్యం విభాగాల్లో ఒక్కొక్క అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు సహా 21 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి 65 ఏళ్లు. అభ్యర్థులు తమ దరఖాస్తులను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌కు సమర్పించాలి. వివరాలకు https: //tnmgrmu.ac.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

'మతసామరస్యం' అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మతసామరస్యం' అవార్డుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో మతసామరస్యం కోసం కృషిచేసే వ్యక్తులకు ప్రతి ఏడాది అవార్డు అందజేస్తుంటారు. గణతంత్ర దినోత్సవం రోజున ముఖ్యమంత్రి ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు. అవార్డు గ్రహీతలకు రూ.5 లక్షల చెక్, పతకం, సర్టిఫికెట్ ఇస్తారు. రాష్ట్రానికి చెందిన, మతసామరస్యం కోసం కృషి చేసే వ్యక్తులు, తమ దరఖాస్తులను డిసెంబరు 15వ తేదీలోగా https://awards.tn.gov.inఅనే వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని ప్రభుత్వం తెలిపింది.

'సోలార్ పవర్ ఇన్‌స్టలేషన్'పై శిక్షణ

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధర్యంలో డిసెంబరు 9 నుంచి 11వ తేది వరకు సోలార్ పవర్ ఇన్‌స్టలేషన్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... సోలార్ పరిశ్రమ ప్రాథమిక వివరాలు, సోలార్ సాఫ్ట్‌వేర్ పరిచయం, బేసిక్ సోలార్ ప్రాజెక్ట్ డిజైన్, ఫైనాన్షియల్ ప్లానింగ్, సబ్సిడీ పథకాలు సహా పలు విషయాలపై శిక్షణ ఇవ్వనున్నారు. టెన్త్ ఉత్తీర్ణులై 18 ఏళ్లు పైబడిన యువతీ, యువకులు శిక్షణలో పాల్గొనవచ్చు. గిండి సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంగణంలోని సంస్థ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుంది. వివరాలకు www. editn.in వెబ్‌సైట్, 8668102600 అనే నెంబరు సంప్రదించవచ్చు.

వైద్య సేవల నెంబర్లు మార్పు

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అత్యవసర వైద్య సేవల నెంబర్లు మారాయి. ఈ మేరకు ఆరోగ్యశాఖ విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ఇప్పటివరకు ప్రసవ నొప్పులు, గుండె పోటు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందించేలా '108' నెంబరు అందుబాటులో ఉంది. తాజాగా, అత్యవసర చికిత్స నెంబర్లు మార్చారు. ఈ మార్పును ప్రజలు గమనించి, తమకు అవసరమైన సహాయాల కోసం దిగువ నెంబర్లు సంప్రదించాలని ఆరోగ్యశాఖ తెలిపింది.

102: గర్భిణులు, పసికందుల ప్రత్యేక అత్యవసర వైద్య సహాయం
1073: రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన అత్యవసర సహాయం
104: ఉచిత వైద్య సలహాలు, వైద్యానికి సంబంధించిన ప్రశ్నలు
108: ఇతర అన్నిరకాల అత్యవసర వైద్య సహాయాలు

రైతుల నుంచి సౌర విద్యుత్ కొనుగోలుకు 'టెండర్లు'

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి 420 మెగావాట్ల సౌర విద్యుత్‌ను యూనిట్‌కు గరిష్ఠంగా రూ.3.10లకు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. రైతులకు వ్యవసాయం ద్వారానే కాకుండా ఏడాది పొడవునా విద్యుత్ ద్వారా కూడా ఆదాయం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి రైతు శక్తి పరిరక్షణ, అభివృద్ధి' పథకం ప్రారంభించింది. ఈ పథకంలో రైతులు తమ భూముల్లో సోలార్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుచేయవచ్చు. ఆ కేంద్రాల్లో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ బోర్డు కొనుగోలు చేస్తోంది. విద్యుత్ బోర్డు అనుబంధ సంస్థ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్, రాష్ట్రంలోని రైతులు, వ్యవసాయ సంఘాలు, సహకార సంఘాల నుంచి 420 మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు టెండర్ ఆహ్వానించింది. యూనిట్ విద్యుత్ గరిష్ఠంగా రూ.3,10 ధర నిర్ణయించారు. ఈ ధర లేదా అంతకంటే తక్కువగా బిడ్డింగ్ చేసే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేయనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

ఉన్నత విద్య అడ్మిషన్లలో ముందంజ

● మంత్రి కోవి.చెళియన్

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య అడ్మిషన్లలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ద్రావిడ మోడల్ ప్రభుత్వాన్ని సీఎం స్టాలిన్ సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని, ఉన్నత విద్యారంగంపై చూపుతున్న శ్రద్ధ కారణంగా అడ్మిషన్లు గత ఏడాది కంటే ఈ ఏడాది గణనీయంగా పెరుగుతున్నాయన్నారు.

ఆరు మార్గాల్లో 130 కి.మీ వేగంతో రైళ్లు

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై-తిరుచ్చి సహా ఆరు మార్గాల్లో గంటకు 130 కి.మీ వేగంతో రైళ్లు నడిపేలా, రైలు మార్గం, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగుపరచడం తదితరాలు చేపట్టినట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. దక్షిణ రైల్వే పరిధిలో చెన్నై, తిరుచ్చి, మదురై, సేలం సహా ఆరు ప్రాంతీయ కార్యాలయాలుండగా, ముఖ్యమైన మార్గాల్లో నడిపే రైళ్ల వేగం పెంచేలా చర్యలు చేపట్టారు. అందుకోసం, అదనపు ట్రాక్‌లను నిర్మించడం, రైల్వే లైను, సిగ్నలింగ్ వ్యవస్థలు మెరుగుపరుస్తున్నారు. చెన్నై సెంట్రల్-గూడూరు, సెంట్రల్-అరక్కోణం-జోలార్‌పేట, సెంట్రల్-రేణిగుంట మార్గాల్లో గంటకు 130 కి.మీ వేగంతో రైళ్లు నడుపుతున్నారు. చెన్నై-కోవై మార్గంలో జోలార్‌పేట నుంచి కోవై వరకు 286 కి.మీ దూరం గంటకు 145 కి.మీ వేగంతో రైళ్లు నడిపేలా గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ విషయమై దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ... జోలార్‌పేట-కోవై మార్గంలో గంటకు 145 కి.మీ వేగంతో రైళ్లు నడిపేలా ట్రయల్ రన్ నిర్వహించామన్నారు. రైల్వే ట్రాక్ నాణ్యత, సిగ్నల్ వ్యవస్థ, ప్రయాణికుల భద్రత తదితరాలపై అధ్యయనం నిర్వహించామన్నారు. ఈ నివేదికను రైల్వే భద్రతా కమిషన్ పరిశీలించి ఆమోదం తెలుపుతుందన్నారు వచ్చే ఆర్థిక సంవత్సరంలోపు ఎగ్మూర్-విల్లుపురం, విల్లుపురం-విరుదాచలం, విరుదాచలం-తిరుచ్చి సహా ఆరు మార్గాల్లో 711 కి.మీ. గంటకు 130 కి.మీ వేగంతో రైళ్లు నడిపేలా రైల్వే ట్రాక్, ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థలు మెరుగుపరిచే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



జోలార్‌పేట-కోవై మధ్య ట్రయల్ రన్

30 నిమిషాలు తగ్గనున్న ప్రయాణ సమయం...

చెన్నై-కోవై మార్గంలో ప్రస్తుతం జోలార్‌పేట వరకు మాత్రమే గంటకు 130 కి.మీ వేగంతో రైళ్లు నడుపుతున్నారు. జోలార్‌పేట-కోవై మధ్య 286 కి.మీ దూరాన్ని 3 గంటల 22 నిమిషాలు ట్రయల్ రన్ నిర్వహించామన్నారు. అదే సమయంలో, ప్రస్తుతం నడుపుతున్న రైళ్లకు 4 గంటల 20 నిమిషాలు పడుతుంది. చెన్నై-కోవై మధ్య గంటలకు 130 కి.మీ వేగంతో రైళ్లు నడిపేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపితే, ప్రయాణ సమయం 30 నిముషాలు తగ్గుతుందని అధికారులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు కన్నుమూత

అడయార్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లాలో కుప్పమ్మాళ్ అనే శతాధిక వృద్ధురాలు తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 110 సంవత్సరాలు. జిల్లాలోని ఒడుకత్తూరు సమీపంలోని తొంగుమలై ప్రాంతానికి చెందిన ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. వీరందరికీ వివాహాలై వేర్వేరుగా జీవిస్తున్నారు. కుప్పమ్మాల్ దంపతులు ఒంటరిగా ఉండగా, కొన్నేళ్ళ క్రితం భర్త కన్నుమూశారు. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడిన వృద్ధురాలు గురువారం స్వగృహంలోనే తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆమె అంత్యక్రియలను గ్రామస్థులంతా కలిసి శుక్రవారం పూర్తి చేశారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి 17యేళ్ల జైలు

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాషర్‌మెన్‌పేటలో కన్న కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ కామాంధుడికి పోక్సోకోర్టు 17యేళ్ల జైలుశిక్ష విధించింది. 43యేళ్ల రైల్వే ఉద్యోగికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఏడో తరగతి చదువుకుంటున్న కుమార్తెను తరచూ లైంగిక వేధింపులకు గురిచేయడంతో ఆగ్రహించిన ఆయన భార్య భర్తపై తిరువొత్తియూర్ మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరువళ్లూరు జిల్లా పోక్సో కోర్టులో జరిగిన ఈ కేసు విచారణ పూర్తికావడంతో గురువారం న్యాయమూర్తి ఉమామహేశ్వరి తీర్పువెలువరించారు. కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సాక్ష్యాధారాలున్నందువల్ల అతడికి 17యేళ్ల జైలుశిక్ష, రూ.75వేలు జరిమానా విధించారు. బాధిత చిన్నారికి రూ.3లక్షలు సహాయంగా అందజేయాలని రాష్ట్రప్రభుత్వానికి న్యాయమూర్తి సిఫారసు చేశారు.

భారీవర్షాలపై ప్రజలను అప్రమత్తం చేయండి

● కౌన్సిలర్లకు చైర్‌పర్సన్ మణిమేఘలై ఆదేశం

తిరుత్తణి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం తరుపున చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై పళ్లిపట్టు పట్టణ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పళ్లిపట్టు కౌన్సిలర్ల అత్యవసర సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ మణిమేఘలై అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జ్యోతికుమార్ సహా పలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, దిత్వా ప్రభావంతో రానున్న రెండు రోజులు ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని సమీపంలోని పునారావాస కేంద్రాలకు తరలించాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కౌన్సిలర్లను ఆదేశించారు. అదేవిధంగా గత వారం తాగునీటి పైపులైన్లు పగిలి కలుషిత తాడగంతో 40 మందికి పైగా అతిసారం బారినపడి ఆస్పత్రి పాలైయ్యారని, దీనిపై తగు చర్యలు తీసుకోనున్నట్లు, బస్టాండు సమీపంలో 5లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్‌ట్యాంక్‌ను నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా ఉదయనిధి జన్మదిన వేడుకలు



అన్నదాన కార్యక్రమంలో డీఎంకే నాయకులు

తిరుత్తణి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినాన్ని గురువారం మధ్యాహ్నం తిరువళ్లూరు జిల్లా అత్తిమాంజేరిపేటలో డీఎంకే నేతలు కోలాహలంగా జరుపుకున్నారు. పళ్లిపట్టు సెంట్రల్ మండల డీఎంకే కన్వీనర్ బీడీ.చంద్రన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ కన్వీనర్ పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం కన్వీనర్ మురళీసేన, మండల యువజన ఉప కార్యదర్శి దేవరాజ్ సహా డీఎంకే యువజన విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళను అడ్డుకున్న కేసులో ఆరుగురికి తలా రెండేళ్ల జైలుశిక్ష

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో వంట మనిషిగా ఎస్సీ మహిళ వద్దంటూ అడ్డుకున్న వ్యవహారంలో మహిళ సహా ఆరుగురికి తలా రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. తిరుప్పూర్ జిల్లా తిరుమలై గౌండన్‌పాళయం ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 2018 జూలైలో షెడ్యూల్ కులానికి చెందిన పాపమ్మాళ్ వంట మనిషిగా నియమితులయ్యారు. పాపమ్మాళ్ వండిన ఆహారాన్ని తమ పిల్లలకు ఇవ్వొద్దంటూ గ్రామంలోని ఒక వర్గానికి చెందిన వారు తెగేసి చెప్పడంతో పాటు పిల్లలను పాఠశాలకు పంపలేదు. ఈ విషయమై పలురకాల ఆందోళనలు నిర్వహించిన నేపథ్యంలో, అంతరానితనం నిరోధకం చట్టం కింద 36 మందిపై కేసు నమోదుచేశారు. ఈ కేసు తిరుప్పూర్ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. ఈ కేసులో ముద్దాయిలుగా ఉన్న నలుగురు మృతిచెందగా, మిగిలిన 31 మందిపై విచారణ సాగింది. కేసు విచారణ ముగిసిన నేపథ్యంలో, గురువారం న్యాయమూర్తి ఇచ్చిన తీర్పులో... కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న 25 మందిని విడుదల చేశారు. మిగిలిన పళనిస్వామి, శక్తివేల్, షణ్ముగం, వెళ్లియంగిరి, దురైస్వామి, సీతాలక్ష్మిలకు తలా రెండేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

పెంపుడు జంతువుల లైసెన్స్ గడువు పెంపు

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువుల లైసెన్స్ గడువు పొడిగించారు. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... జీసీసీ పరిధిలో పెంపుడు జంతువులను క్రమబద్ధీకరించేలా 2023 ఆగస్టు నుంచి జీసీసీ వెబ్‌సైట్‌లో పెంపుడు జంతువులకు లైసెన్స్ విధానం అమలులోకి వచ్చింది. అనంతరం పెంపుడు జంతువులకు లైసెన్స్ పొందే విధానం సులభతరం చేసేలా 'ఆన్‌లైన్ పోర్టల్'ను మేయర్ గత నెల 3వ తేది ప్రారంభించారు. లైసెన్స్ పొందేందుకు ఇదివరకే ప్రకటించిన గడువు ముగిసిన నేపథ్యంలో, యజమానుల కోరిక మేరకు డిసెంబరు 7వ తేదీ వరకు పొడిగించారు.

సెంగోట్టయ్యన్ బీజేపీ 'స్లీపర్ సెల్'

● మంత్రి రఘుపతి ధ్వజం



ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేఏ.సెంగోట్టయ్యన్ బీజేపీ 'స్లీపర్ సెల్' అని రాష్ట్ర న్యాయ, జైళ్లశాఖ మంత్రి రఘుపతి ధ్వజమెత్తారు. పుదుకోటలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, అన్నాడీఎంకే నుంచి 9సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవిలో కూడా కొనసాగిన సెంగోట్టయ్యన్ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే కండువా కప్పుకున్నారని, వాస్తవానికి ఒక ప్రత్యేక అసైన్మెంట్ కోసం బీజేపీ ఆయనను టీవీకేలోకి పంపించిందని ఆరోపించారు. కమలం పార్టీకి లబ్దిచేకూర్చేవారిలో సెంగోట్టయ్యన్ కూడా ఒకరని, ఆయన టీవీకేను బీజేపీ కూటమిలో చేర్చేరోజులు దగ్గర పడుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ప్రజలు మెచ్చే పాలన కొనసాగుతుందని, అన్ని వర్గాలకు సమన్యాయం చేయడం వల్ల రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మళ్లీ డీఎంకే మెజారిటీ విజయం సాధించి అధికారపీఠం ఎక్కుతుందని మంత్రి రఘుపతి నమ్మకం వ్యక్తంచేశారు.

తిరువణ్ణామలై స్టేషన్‌లో పోలీసు తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వేలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో నిర్వహిస్తున్న కార్తిక దీపోత్సవాన్ని పురస్కరించుకుని పలు జిల్లాలు, రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆలయం, తిరువణ్ణామలై పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ కార్యక్రమాలు చోటుచేసుకోకుండా అదనపు పోలీసు బలగాలు రైల్వేస్టేషన్, బస్టాండు సహా గిరి ప్రదక్షిణ ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తోంది. అనుమానాస్పదంగా సంచరించేవారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జనగణన పనితీరుపై అధికారుల పరిశీలన



తిరుత్తణి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట సమీపంలోని రాజానగరం, సెల్లత్తూరు గ్రామాల్లో గత శనివారం నుండి జనగణన కార్యక్రమాన్ని ఆ ప్రాంత రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం సెలత్తూరు గ్రామంలో జనగణనపై అధికారుల పనితీరును జిల్లా రెవెన్యూశాఖ అధికారి సురేష్, జాయింట్ డైరెక్టర్ లింగస్వామి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వసంతకుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ జస్పాల్ సింగ్, ఆర్కేపేట తహసీల్దార్ సరస్వతి, వీఆర్వో శరవణన్, స్టాటిస్టిక్ అనలిస్ట్ ప్రియాంక, రెవెన్యూ అనలిస్ట్ దేవి, సెలత్తూరు గ్రామాధికారి తమిళరసు తదితరులు పాల్గొన్నారు.

హాకీ ప్రపంచ కప్‌కు విద్యార్థుల పయనం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో జరగనున్న బాలుర హాకీ ప్రపంచ కప్ పోటీలకు వేలూరు జిల్లావ్యాప్తంగా ఉన్న పలు విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులను పంపిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు బయలుదేరే బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన విద్యాశాఖ అధికారి ప్రేమలత, క్రీడాశాఖ అధికారి సుబ్రమణి, సరస్వతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లలిత కళా అకాడమీలో 1న సీమా కోహ్లి ఎగ్జిబిషన్

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక లలిత కళా అకాడమీలో డిసెంబర్ 1 నుండి 'ఆకాశంపై భూమి చేవ్రాలు' అనే అంశంపై ప్రముఖ కళాకారిణి సీమా కోహ్లి సోలో ఎగ్జిబిషన్ ప్రారంభమవుతోంది. స్త్రీత్వం గొప్పదనాన్ని తెలియజేసే విధంగా ఏర్పాటయ్యే ఈ ప్రదర్శనలో పెయింటింగ్, శిల్పాలు, వీడియో ప్రసారాలు, ఇన్‌స్టాలేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రదర్శన డిసెంబర్ 28 వరకు కొనసాగనుంది.



కళాకారిణి సీమా కోహ్లి

నేడు పనిచేయనున్న 'సర్' సహాయ కేంద్రాలు

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు పూర్తిచేసిన ఫారాలను సమర్పించేందుకు శనివారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సహాయ కేంద్రాలు పనిచేస్తాయని జీసీసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి జె.కుమరగురుబరన్ తెలిపారు. సర్-2026 పనులు నగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ నెల 4వ తేదీ ప్రారంభమయ్యాయి. 200 వార్డుల్లో బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఫారాలను పంపిణీ చేసి పూర్తి చేసిన వాటిని తిరిగి స్వీకరిస్తున్నారు. ఈ చర్యల్లో భాగంగా, ఫారాలను పూర్తి చేసేందుకు ఓటర్లకు సహకరించేందుకు అనుగుణంగా ప్రత్యేక సహాయ కేంద్రాలు ఈ నెల 18 నుండి 25వ తేదీ వరకు ఎనిమిది రోజులు పనిచేశాయి. ఇన్ని వసతులు అందుబాటులో ఉన్నప్పటికీ కొంతమంది ఓటర్లు పూర్తిచేసిన ఫారాలను తిరిగి సమర్పించలేదని తెలిసింది. ఓటరు ఫారాలను స్వీకరించే గడువు సమీపిస్తున్నందు వల్ల నగరంలో ఉన్న 947 పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు అధికంగా నివసిస్తున్న బహుళ అంతస్తు భవనాలు, అపార్ట్‌మెంట్లలో పూర్తిచేసిన ఫారాలను స్వీకరిస్తారు. ఈ ప్రత్యేక సహాయ కేంద్రాలు శనివారం ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయి. ఇందువల్ల ఓటర్లు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవల్సిందిగా జీసీసీ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆమ్నీ బస్సు యజమానుల సమ్మె విరమణ

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆమ్నీ బస్సుల యజమానులు సమ్మె విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. రాష్ట్రం నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్న ఆమ్నీ బస్సులకు, ఆయా రాష్ట్రాల అధికారులు భారీగా జరిమానా విధిస్తున్నారు. ఈ విషయమై స్పందించి ఆయా రాష్ట్రాల అధికారులతో చర్చించి ఒకే జరిమానా వసూలుచేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ ఆమ్నీ బస్సుల యజమానులు సమ్మెకు పిలుపునిచ్చారు. ఆమ్నీ బస్సుల యజమానులతో రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ చర్చలు జరిపారు. ఇది ఫలితం ఇవ్వడంతో, 18 రోజులుగా చేపట్టిన సమ్మె విరమించుకుంటున్నట్లు, శుక్రవారం సాయంత్రం నుంచి ఆమ్నీ బస్సులు పొరుగు రాష్ట్రాలకు యథావిధిగా నడుస్తాయని ఆమ్నీ బస్సుల యజమానులు ప్రకటించారు.

జన్మదినం జరపలేదని విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజున కొత్త బట్టలు కొనివ్వలేదని విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తేని జిల్లాలో చోటు చేసుకుంది. తమ్మంపట్టి ప్రాంతానికి చెందిన కుమార్-సంగీత దంపతులకు ఇద్దరు కుమారులు, పూవిక (17) అనే కుమార్తె ఉంది. ఈ నెల 21న పూవిక పుట్టినరోజు కాగా, తల్లిదండ్రులు ఆమెకు కొత్త బట్టలు, కేక్ కొనివ్వలేదు. దీనిపై తల్లిదండ్రులతో పూవిక వాదన పడినట్లు సమాచారం. ఘటన జరిగిన రోజు ఉదయం పూవిక హఠాత్తుగా వాంతులు చేసుకుంది. తల్లిదండ్రులు ఆమెను విచారించగా, నా పుట్టినరోజు జరపకపోవడంతో విషం తాగినట్టు చెప్పింది. దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు, ఆమెను వెంటనే కంభం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తేని ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక పూవిక మృతిచెందింది. ఈ ఘటనపై కూడలూరు వెస్ట్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

8న కావేరి నిర్వహణ మండలి సమావేశం

● మెకెదాటు డ్యాంపై చర్చ

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కావేరి నిర్వహణ మండలి సమావేశం డిసెంబరు 5వ తేదీ ఢిల్లీలో జరుగుతుందని ప్రకటించారు. ఈ క్రమంలో, కావేరి నదిపై మెకెదాటు డ్యాం నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన ప్రాజెక్ట్ నివేదికను కావేరి నిర్వహణ మండలికి సమర్పించింది. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలుపరాదని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయడంతో పాటు సమావేశంలో ఈ ప్రాజెక్ట్ గురించి చర్చించరాదని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో, మెకెదాటు డ్యాంకు సంబంధించి కావేరి నిర్వహణ మండలిలో అభిప్రాయాలు తెలుపవచ్చని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో, కావేరి నిర్వహణ మండలి సమావేశంలో డిసెంబరు 8వ తేది ఢిల్లీలో జరుగుతుందని ప్రకటించిన నేపథ్యంలో, సమావేశంలో మెకెదాటు డ్యాంపై కర్ణాటక ప్రభుత్వం చర్చించాలని నిర్ణయించింది.

కోర్టు ధిక్కరణ కేసులో అధికారికి జైలు

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోర్టు ధిక్కరణ కేసులో, కూవత్తూరు ప్రాథమిక వ్యవసాయమ సహకార రుణ సంఘం ప్రత్యేక అధికారికి, నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అరియలూరు జిల్లా ఉడయార్‌పాళం తాలూకా కూవత్తూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘం కార్యదర్శిగా పనిచేస్తున్న చిన్నప్పన్ 2009 జూన్ 30వ తేది పదవీవిరమణ పొందారు. తనకు రావాల్సిన పదవివిరమణ ప్రయోజనాలు ఇప్పించాలని కోరుతూ 2017లో చిన్నప్పన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారించిన హైకోర్టు, రెండు వారాల్లో పదవీ విరమణ ప్రయోజనాలు అందించాలని 2022 ఫిబ్రవరిలో ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో, కూవత్తూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘం ఛైర్మెన్ కలైసెల్వన్, ప్రత్యేక అధికారి కలైఅరసన్‌లపై కోర్టు ధిక్కరణ కేసును చిన్నప్పన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రమేష్ జారీచేసిన ఉత్తర్వుల్లో... ఈ కేసు పలుసార్లు విచారణకు వచ్చినా, కోర్టు ఆదేశాలు అమలుచేయలేదు. విచారణకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని రెండు సార్లు ఆదేశాలు జారీ అయ్యాయి. ఒకసారి వారెంట్ కూడా జారీ చేయబడింది. పిటిషనర్‌కు రూ.16.47 లక్షలు చెల్లించాల్సి ఉండగా, రూ.6,80,470 మాత్రమే చెల్లించారు. ఇది కోర్టు ధిక్కారంగా పరిగణించబడున్నందున, శిక్ష ఎందుకు విధించకూడదో వివరించాలని ఆదేశాలు జారీచేసినా, వారు వివరణ ఇవ్వలేదు, ఆదేశాలు అమలుచేయలేదు. ఈ కారణంగా, కూవత్తూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘం ప్రత్యేక అధికారి కలైఅరసన్‌కు నెల జైలు శిక్ష విధిస్తూ, తదుపరి విచారణ డిసెంబరు 12వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

కోయంబేడు మార్కెట్లో నాలుగు రెట్లు పెరిగిన పూల ధరలు

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌కు పూల దిగుబడి తగ్గడంతో, వాటి ధరలు నాలుగు రెట్లు పెరిగాయి. ఆ ప్రకారం, గురువారం కిలో మల్లెపూలు ధర రూ.600 నుంచి రూ.3,000 పెరిగింది. అలాగే, ఐస్ మల్లి రూ.500 నుంచి రూ.2,500, ముల్లై, జాజిమల్లి రూ.400 నుంచి రూ.2,000, కనకాంబరాలు రూ.500 నుంచి రూ.1,000, చామంతి రూ.80 నుంచి రూ.140, సంపంగి రూ.50 నుంచి రూ.140, అరళి పూ రూ.200 నుంచి రూ.300, పన్నీర్ రోజ్ రూ.60 నుంచి రూ.140, చాక్లెట్ రోజ్ రూ.100 నుంచి రూ.160కి పెరిగాయి. ఈ విషయమై మార్కెట్ ఉపాధ్యక్షులు ముత్తురాజ్ మాట్లాడుతూ... మంచు కురవడం, దిగుబడులు తగ్గడంతో గురువారం చాలా తక్కువగా పూలు మార్కెట్‌కు వచ్చాయన్నారు. రాబోయే రోజుల్లో మంచు తీవ్రత అధికంగా ఉండే అవకాశముండడంతో పూల ధరలు మరింత పెరిగే అవకాశముందని ముత్తురాజ్ తెలిపారు.

మినీబస్సు ఢీకొని రెండేళ్ల బాలుడికి గాయాలు

తిరుత్తణి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మినీబస్సు ఢీకొని రెండేళ్ల బాలుడు ఆస్పత్రి పాలైన సంఘటన తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేటలో చోటు చేసుకుంది. వివరాలిలా... ఆర్కేపేట సమీపంలోని కందపురం గ్రామానికి చెందిన కలైయరసన్ తన రెండేళ్ల కుమారుడు సహా కుటుంబ సభ్యులతో కలిసి ఆర్కేపేటలోని తన బంధువుల వివాహానికి వెళ్లారు. తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తుండగా, కలైయరసన్ కుమారుడు తిరుప్పుగరాజ్ (2) కల్యాణమండపం బయట నిలబడి ఉండగా ఓ మినీ బస్సు అదుపు తప్పి బాలుడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలుడిని వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం చెన్నై తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న ఆర్కేపేట పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పారిశుధ్య కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

● సీపీఐ డిమాండ్

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల డిమాండ్లు పరిశీలించి పరిష్కరింపజేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండ్యన్ డిమాండ్ చేశారు. ఆయన నగరంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ జీసీసీ పరిధిలోని 5, 6 జోన్లలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం మూడు నెలలకు పైగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి డిమాండ్లు న్యాయపరమైనవేనని, ముఖ్యమంత్రి స్టాలిన్ వీటిని పరిశీలించి పరిష్కరింపజేయాలని ఆయన కోరారు.

కోవై మెట్రోరైలు ప్రాజెక్ట్ వ్యవహారం...

డీఎంకే-అన్నాడీఎంకే కార్పొరేటర్ల వాగ్వాదం

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ మెట్రోరైలు ప్రాజెక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం నిరాకరించిన నేపథ్యంలో, డీఎంకే-అన్నాడీఎంకే కార్పొరేటర్లు వాగ్వివాదానికి దిగారు. కోవై కార్పొరేషన్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో కోవై మెట్రోరైలు ప్రాజెక్ట్ విషయాన్ని అన్నాడీఎంకే సభ్యులు లేవనెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక ఇవ్వడంలో విఫలమైందని, అందువల్లే మెట్రోరైలు ప్రాజెక్ట్ నిరాకరణకు గురైందని అన్నాడీఎంకే సభ్యులు ఆరోపించారు. వారి ఆరోపణలు ఖండించిన డీఎంకే సభ్యులు... రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతూ పథకాలు, నిధులు ఇవ్వకుండా పక్షపాతం చూపుతోందని ప్రతిదాడికి దిగారు. ఒకానొక సమయంలో, ఇరుపార్టీల సభ్యులు వాగ్వివాదానికి దిగారు. అనంతరం, రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ అన్నాడీఎంకే సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు.



సభలో నినాదాలు చేస్తున్న డీఎంకే-అన్నాడీఎంకే సభ్యులు

రజనీకాంత్‌ను డైరెక్ట్ చేయనున్న

యంగ్ డైరెక్టర్



రజనీకాంత్, కమల్ హాసన్, రామ్‌కుమార్

అగ్ర నటుడు కమల్ హాసన్ నిర్మాతగా సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నటించే చిత్రానికి యంగ్ డైరెక్టర్ రామ్‌కుమార్ దర్శకత్వం వహించనున్నారు. మూడు జాతీయ అవార్డులు అందుకున్న 'పార్కింగ్' చిత్రంతో ప్రతి ఒక్కరి ప్రశంసలు అందుకున్న రామ్‌కుమార్‌ను 'తైలవర్ 173' చిత్రానికి దర్శకుడిగా ఖరారు చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. నిజానికి ఈ చిత్రాన్ని సుందర్‌ను దర్శకుడిగా ముందుగా ఎంపిక చేసి, అధికారికంగా ప్రకటించారు. అయితే, అనివార్య కారణాలతో ఈ ప్రాజెక్టు నుంచి సుందర్ తప్పుకున్నారు. దీంతో కొత్త దర్శకుడు ఎవరన్నదానిపై సందిగ్ధత నెలకొంది. ఇపుడు దీనిపై ఓ క్లారిటీ వచ్చింది. 'పార్కింగ్' వంటి ఒక మంచి కథతో ఘన విజయాన్ని అందుకున్న రామ్‌కుమార్ సూపర్‌స్టార్‌కు చెప్పిన కథ నచ్చడంతో ఒకే చెప్పినట్టు సమాచారం. రజనీకాంత్ పుట్టిన రోజైన డిసెంబరు 12న దీనిపై అధికారిక ప్రకటన వెల్లడించనున్నారు.



శివకుమార్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న సీఎం స్టాలిన్

నటుడు శివకుమార్‌కు గౌరవ డాక్టరేట్

- ప్రదానం చేసిన సీఎం స్టాలిన్

తమిళ చిత్రపరిశ్రమలోని సీనియర్ నటుడు శివకుమార్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. నాటక, సినీ రంగాలకు శివకుమార్ చేసిన సేవలకు గుర్తింపుగా డాక్టర్ జె.జయలలిత ప్రభుత్వ మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం కలైవాణర్ అరంగంలో జరిగిన కార్యక్రమంలో శివకుమార్‌కు గౌరవ డాక్టరేట్‌ను సీఎం అందజేశారు. ఆ తర్వాత శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ, చిత్రకారుడు, నటుడు, వక్త వంటి అర్హతల ఆధారంగా చేసుకుని ఈ గౌరవ డాక్టరేట్ ప్రకటించారని భావిస్తున్నానని, దీన్ని స్వీకరించడంతో నాకు గర్వంగా ఉందన్నారు. శివకుమార్ నటుడిగా కంటే మంచి రంగస్థల కళాకారుడు. వేదికలపై కంభరామాయణం, మహాభారతం, తిరుక్కురల్ ఇతిహాసాలపై అనర్గళంగా ప్రసంగించగలరు. ఇదిలావుంటే, గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించిన నటుడు శివకుమార్‌కు నడిగర్ సంఘం అభినందనలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేసింది.

చిత్రజ్యోతి

ఒక్కరోజు రాత్రి జరిగే కథతో

'ఫ్రైడే' మూవీ



'ఫ్రైడే'లో మైమ్ గోపి, కేపీవై దీనా, అనీష్

ఒక్క రోజు రాత్రి జరిగే స్టోరీతో తెరకెక్కిన చిత్రం 'ఫ్రైడే'. హరి వెంకటేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మైమ్ గోపి, కేపీవై దీనా, అనీష్ మాసిలామణి, రామచంద్ర దురైరాజ్, కలైయరసన్, సిద్ధు కుమరేశన్ తదితరులు నటించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు హరి వెంకటేష్ వివరిస్తూ, 'ఒక రోజు రాత్రి జరిగే కథతో గ్రిప్పింగ్ క్రైం థ్రిల్లర్‌గా, ప్రేక్షకుల ఊహకు అందని మలుపులతో ఈ చిత్రాన్ని నిర్మించాం. ఇందులో పెద్దపెద్ద నటీనటులు లేరు. చిన్న నటీనటులతో ఉత్కంఠభరితమైన క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కించడం జరిగింది. ఇందులో హింసాత్మక సన్నివేశాలున్నప్పటికీ అవి ప్రేక్షకులకు భయపెట్టేలా ఉండవు. మైమ్ గోపి, కేపీవై దీనా, అనీష్ మాసిలామణి నటన ప్రశంసనీయం. కేపీవై దీనా - హీరోయిన్ సిద్ధు కుమరేశన్ మధ్య వచ్చే రొమాన్స్ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ప్రేక్షకులకు మంచి సందేశం ఇవ్వాలన్న ప్రధాన ఉద్దేశంతో ఈ సినిమా నిర్మించాం' అని పేర్కొన్నారు.



మూవీలో ఓ దృశ్యం

గ్రామాచారం ఇతివృత్తంగా 'ఒండిమునియుమ్ నల్లపాడనుమ్'

గ్రామంలో మేకపోతును బలిచ్చే ఆచారాన్ని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని రూపొందిన చిత్రం 'ఒండిమునియుమ్ నల్లపాడనుమ్'. పరోటా మురుగేశన్, విజయన్ దియా, విద్యా శక్తివేల్, చిత్రా నాగరాజన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. కేపె కుప్పుస్వామి నిర్మించిన ఈ చిత్రానికి ఆర్.సుగవనం దర్శకత్వం వహించారు. పూర్తి గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించారు. గ్రామంలో నివసించే పరోటా మురుగేశన్ కుమారుడు విజయన్ దియా అనారోగ్యం పాలవుతాడు. కుమారుడి ఆరోగ్యం సరిచేసి, ప్రాణాలు నిలబెడితే మేకపోతును బలిస్తానని గ్రామంలోని ఒండిమునిస్వామికి మొక్కుకుంటాడు. అతని కోరిక తీరిన తర్వాత మేకపోతు బలివ్వకుండా ఆ గ్రామానికి చెందిన ఇద్దరు ధనవంతులు అడ్డుకుంటారు. ఇంతలో బలివ్వాల్సిన మేకపోతు తప్పిపోతుంది. ఆ తర్వాత ఆ మేకపోతు కనిపించిందా? ఒండిమునిస్వామికి ఆ మేకపోతును బలిచ్చారా? అన్న కథాంశంతో మూవీని హాస్యభరితంగా నిర్మించారు. ఈ కథపై దర్శకుడు స్పందిస్తూ, 'ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ తమతమ పాత్రలకు న్యాయం చేశారు. ముఖ్యంగా పరోటా మురుగన్ కుమారుడుగా నటించిన విజయన్ దియా బాధ్యతారహితమైన గ్రామీణ యువకుడుగా ఉన్నప్పటికీ తన తండ్రి పరిస్థితిని అర్థం చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించే సన్నివేశాలు ఎంతో సహజసిద్ధంగా ఉంటాయి. హీరోయిన్‌గా నటించిన విద్యా శక్తివేలన్ గ్రామీణ యువతిగా అద్భుతంగా నటించారు. గ్రామంలో జరిగిన వాస్తవిక ఘటనను ఇతివృత్తంగా తీసుకుని గ్రామ ప్రజల జీవితాన్ని సహజసిద్ధంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం' అని వివరించారు.

వృత్తిమీద నిబద్ధతతో ప్రవృత్తిని మరచిపోతారు కొందరు. వృత్తి జీవితంలోని ఒత్తిడులతో తమ అభిరుచులకు దీర్ఘకాలిక విరామం ఇస్తుంటారు మరికొందరు. వృత్తి జీవితం, కుటుంబ జీవితం మధ్య నలిగిపోతూ తమ ప్రవృత్తులకు తిలోదకాలు ఇస్తుంటారు ఇంకొందరు. అయితే తమ ప్రవృత్తులను పండించుకుని జీవితాన్ని ఆస్వాదించాలి అనుకునేవారు వృత్తి, ప్రవృత్తులకు సమ ప్రాధాన్యం ఇచ్చి సమయాన్ని కేటాయించుకుని జీవితానందాన్ని అనుభవిస్తారు. అలాంటి వారిలో డాక్టర్ శ్వేత ఒకరు. ఆమె డాక్టర్‌గా తన వృత్తి నిర్వహిస్తూ, భరతనాట్య కళాకారిణిగా తన ప్రవృత్తిని పండించుకుంటున్నారు. ఆమె వృత్తి ప్రవృత్తుల జీవిత ప్రస్థానం ఈ నాటి తరుణిలో...







వృత్తి, ప్రవృత్తుల సమన్వయం

నృత్య, దంత వైద్య సేవల ప్రత్యేకం

"ముద్రాలయ అకాడమీ ఆఫ్ డాన్స్" వ్యవస్థాపకురాలు డాక్టర్ శ్వేత

డాక్టర్ శ్వేత పుట్టి పెరిగింది చెన్నై నగరంలో. తల్లి రాజ్యలక్ష్మి ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. తండ్రి మనుస్వామి ఫెడరల్ బ్యాంక్ మేనేజర్‌గా పదవీవిరమణ పొందారు. శ్వేతకు ఇక సోదరుడు. శ్వేత 10వ తరగతి వరకు గోపాలపురంలోని డీఏవీ స్కూల్‌లో చదివి, ఆపై సేలంలోని బోర్డింగ్ స్కూలులో 11, 12వ తరగతులను పూర్తిచేశారు. చెన్నై నగరంలోని ఉతండిలో రాగాస్ మెడికల్ కాలేజీలో బీడీఎస్ పూర్తిచేశారు.



వృత్తి జీవితం....

దంత వైద్యురాలిగా పట్టా పుచ్చుకున్న డాక్టర్ శ్వేత చెన్నైలోని అనగాబత్తూరులో డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఐదేళ్ల క్రితం "రేడియంట్ స్మైల్ డెంటల్ కేర్" స్థాపించి దంత వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. "ప్రతి ఒక్కరు దంత సంరక్షణకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, నిత్యం ఉదయం, రాత్రి దంతాలను శుభ్రపరుచుకోవాలి, దంతాలకి సంబంధించి ఏ చిన్న సమస్య ఎదురైనా నిర్లక్ష్యం వహించకుండా దంత వైద్యులను సంప్రదించాలని సూచించారు.

"ఏ కళ నేర్చుకోవాలన్నా నిబద్ధత, అంకిత భావం ఉండాలి. నాట్యం నేర్చుకునేవారంతా సాధన కోసం తగిన సమయాన్ని కేటాయించుకోవాలి. సంకల్పం, పట్టుదల, దీక్ష, కఠోర పరిశ్రమ ఉంటేనే నాట్య కళాకారులుగా రూపుదిద్దుకుంటారు. అద్భుతాలను సృష్టిస్తారు." అని తరుణితో తన అనుభవాలు పంచుకున్నారు.

భరత నాట్యకళాకారిణిగా...

ఐదేళ్ల చిరుప్రాయంలోనే భరతనాట్యానికి శ్రీకారం చుట్టారు శ్వేత. గురు శారదా సేతురామన్ వద్ద నాట్యంలో ఓనామాలు దిద్దారు. అనంతరం డాక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం శిష్యురాలైన డాక్టర్ సుజాత మోహన్

తరుణి

దగ్గర నాట్య శిక్షణ తీసుకున్నారు. విద్యా అరసు శిష్యరికంలో అంకిత భావంతో సాధన చేసి తన నాట్యకౌశలాన్ని మెరుగుపరుచుకున్నారు.. భరతనాట్య కళాకారిణిగా ఎన్నో వేదికలపై ప్రదర్శలిచ్చారు. చెన్నైలోని సభలు, దేవాలయాలేకాక ప్రతిష్టాత్మకమైన నాట్యాంజలి ఫెస్టివల్స్‌లో చిదంబరం, మహాబలిపురం తదితర ప్రదేశాల్లో తన భరతనాట్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆమె చేసే నాట్యానికి ప్రశంసలు, పురస్కారాలు లభించాయి. డాక్టర్ శ్వేత నాట్యకళాకారిణి మాత్రమే కాదు, కొరియోగ్రాఫర్ కూడా. డాక్టర్ శ్వేత భరతనాట్య కళాకారిణిగా "ముద్రాలయ అకాడమీ ఆఫ్ డాన్స్" అనే పేరుతో ఒక స్కూల్ నడుపుతున్నారు. తన వైద్యవృత్తికి ఆటంకం కలగని విధంగా సమయాన్ని నిర్ణయించుకున్నారు. వృత్తి జీవితం, కుటుంబజీవితం, ప్రవృత్తి జీవితం అన్నిటికీ ప్రాధాన్యత ఇచ్చి సంతృప్తికరమైన జీవితానికి బాటలు వేసుకున్నారు. తన డాన్స్ అకాడమీలో నాలుగేళ్ల నుంచి ముప్పై ఏళ్ల వయసు వరకు సుమారు నలభై మందికి పైగా శిష్యులున్నట్లు తెలిపారు శ్వేత.

కుటుంబ నేపథ్యం...

శ్వేత జీవితభాగస్వామి జగదీశ్ బ్యాంక్ ఉద్యోగి. వీరికి ఒక కుమారుడు. తను ఎంచుకున్న రంగాల్లో రాణించడానికి ముఖ్యకారణం తన కుటుంబమేనని, తన తల్లిదండ్రులు, భర్త తనకు అండగా ఉన్నారని, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వృత్తిలో బిజీగా ఉన్నా సాయంత్ర వేళల్లో తన ప్రవృత్తికి న్యాయం చేస్తున్నానని శ్వేత పేర్కొన్నారు.

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

అంబిక, రాధలకు మాతృవియోగం



సరసమ్మ (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటీమణులు అంబిక, రాధ మాతృమూర్తి సరసమ్మ(86) గురువారం కేరళలో మృతి చెందారు. 2014 వరకు కేరళ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారు. కేరళ రాష్ట్రం కల్లారై వద్ద నివసిస్తున్న సరసమ్మ తీవ్ర అస్వస్థత, వృద్ధాప్య సమస్యల కారణంగా కన్నుమూశారు. ఆమెకు అంబిక, మల్లిక, రాధ అనే ముగ్గురు కుమార్తెలు, మల్లిఖార్జున్, సురేష్ అనే ఇద్దరు కుమారులున్నారు. ఆమె అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని నటి అంబిక పేర్కొన్నారు.


మణిముత్తూరు, అగస్తియర్ జలపాతాల్లో స్నానాలపై నిషేధం



ఎగిసిపడుతున్న మణిముత్తారు జలపాతం

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాల్లో పటమటి కనుమల్లో భారీ వర్షం కురవటంతో మణిముత్తూరు, అగస్తియర్ జలపాతాల్లో నీటి ఉధృతి అధికమైంది. ప్రస్తుతం ఆ రెండు జలపాతాల వద్ద వరద పరిస్థితులు నెలకొనటంతో శుక్రవారం ఉదయం పర్యాటకులను స్నానానికి అనుమతించకుండా అధికారులు కట్టుదిట్టం చేశారు. వర్షం కారణంగా పాపనాశం డ్యాంలో నీటి మట్టం 134 అడుగులకు పెరిగింది. ఇదే విధంగా సేర్వలారు డ్యాం నీటిమట్టం కూడా 137.5 అడుగులకు చేరింది. మణిముత్తూరు నీటి మట్టం 107.5 అడుగులుగా నమోదైంది.

ఘనంగా టీఎంసీ 12వ వార్షికోత్సవం



టీఎంసీ అధ్యక్షుడు జీకేవాసన్‌ను సత్కరిస్తున్న పార్టీ నేతలు

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమిళమానిల కాంగ్రెస్ (టీఎంసీ) 12వ వార్షికోత్సవాన్ని ఆళ్వార్‌పేటలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, కేంద్రమాజీ మంత్రి జీకే వాసన్ పార్టీ జెండా ఆవిష్కరించి కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు మెప్పుపొందే విధంగా ఎన్డీయే కూటమి ఉందని, దీనిలో అన్నాడీఎంకే, బీజేపీ, టీఎంసీ, ఐజేకే, న్యూజస్టిస్ పార్టీ ఏకాభిప్రాయంతో ఉన్నాయన్నారు. వేడుకల్లో ప్రధాన కార్యదర్శులు, జీఆర్ వెంకటేష్, ఎంపీ నాథన్, రాణి కృష్ణన్, ఈకే అరుణ్‌కుమార్, తండ్లం రవి, బిజుచాకో, బీఎన్ వేణుగోపాల్, పి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 'వాహన మిత్ర' అమలుచేయాలి

- హిందూ మున్నని ఆటో యూనియన్ డిమాండ్



సంతకాల సేకరణలో వినోద్ ఖన్నా, ఆటో డ్రైవర్లు

తిరువళ్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 'వాహన మిత్ర' పథకాన్ని రాష్ట్రంలో అమలుచేయాలని హిందూ మున్నని ఆటో యూనియన్ కాంచీపురం యూనియన్ కార్యదర్శి వినోద్ ఖన్నా డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో జిల్లావ్యాప్తంగా ఆటో డ్రైవర్ల నుంచి సంతకాల సేకరణ శుక్రవారం రైల్వేస్టేషన్ సమీపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్ ఖన్నా మాట్లాడుతూ... రాష్ట్రంలో ఊబర్, ఓలా వాహనాలు పెరగడం, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో సాధారణ ఆటో డ్రైవర్ల జీవనంపై తీవ్ర ప్రభావం పండిందన్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్‌లో ఆటో డ్రైవర్ల కోసం అమలు చేస్తున్న వాహనమిత్ర పథకాన్ని రాష్ట్రంలో అమలుచేయాలని కోరుతూ ఆటో డ్రైవర్ల నుంచి సంతకాలు సేకరిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సంతకాల సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ఆయన తెలిపారు.

నంది వాహనంపై

అరుణాచలేశ్వరుడు



నంది వాహనంపై ఉనాములై సమేత అన్నామలైయార్

వేలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై క్షేత్రంలో జరుగుతున్న కార్తిక దీపోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు కల్పవృక్ష వాహనంపై విహరించగా, శుక్రవారం తెల్లవారుజామున నంది వాహనంపై ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్ మాడవీధుల్లో ఊరేగారు. అదేవిధంగా పంచమూర్తులైన గణపతి వెండి మూషిక వాహనంపై, వల్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి హంసవాహనంపై, పరాశక్తి అమ్మవారిని కామధేనువు వాహనంపై, చిన్ననంది వాహనంపై చండికేశ్వరుల ఉత్సవమూర్తులను అలంకరించి మాడవీధుల్లో విహరింపజేయగా, భక్తులు ఉత్సవమూర్తులకు హారతులిచ్చారు. ఆలయ ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా నామ సంకీర్తన సిల్వర్ జూబ్లీ వేడుకలు




పురస్కార గ్రహీతలతో గవర్నర్ ఆర్‌ఎన్ రవి, నిర్వాహకులు

ప్యారీస్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):సంప్రదాయ, శాస్త్రీయ కళలను పోషిస్తున్న శ్రీ కృష్ణగాన సభ, భాగవతార్ కుటుంబాల సంక్షేమం కోసం కృషిచేస్తున్న భాగవత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నామ సంకీర్తన సిల్వర్‌జూబ్లీ వేడుకలను గవర్నర్ ఆర్‌ఎన్ రవి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. టి.నగర్‌లోని కృష్ణగాన సభ డా.నల్లి గానవిహార్‌లో సిటీ యూనియన్ బ్యాంక్ సీఈవో, భాగవత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డా.ఎం.కామకోడి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో గవర్నర్ రవికి రాధాకృష్ణుల తంజావూరు పెయింటింగ్ జ్ఞాపికగా అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నమాచార్య, భద్రాచల రామదాసు కీర్తనలు, అలాగే కబీర్‌దాస్, పురందర్‌దాస్ తదితర సంగీత దిగ్గజాల కీర్తనలను విశ్వవ్యాప్తంచేయాలన్న దృక్పథంతో కంచి మఠాధిపతులు జయేంద్ర సరస్వతి, విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా 2002లో ప్రారంభించిన భాగవత సేవా ట్రస్ట్ దక్షిణ భారత సంప్రదాయాలకు అద్దంపడుతూ ప్రతి సంవత్సరం నవంబరు నుండి డిసెంబరు వరకు నామ సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. తమ ట్రస్ట్ తరుపున మృతిచెందిన భాగవతుల అంతిమయాత్రకు రూ.40వేలు అందజేయడంతో పాటు 140 మంది భాగవతార్లకు పింఛన్, గృహిణులకు ఆర్థికసాయం, వారి పిల్లలకు విద్యా ఉపకారవేతనాలు అందించి ప్రోత్సహిస్తోందన్నారు. సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా బ్రహ్మశ్రీ యజ్ఞశర్మకు 'సంకీర్తన కళానిధి', కడలూరు గోపి భాగవతార్‌కు 'సంకీర్తన చూడామణి' పురస్కారాలను గవర్నర్ ఆర్ ఎన్ రవి ప్రదానం చేశారు. వారికి గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, రూ.50వేల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మం బలమైన శక్తిగా ఉందని, ప్రపంచానికి భారతదేశం పూజగది వంటిదని, కలియుగంలో ప్రతి ఒక్కరిలో భక్తిభావం, ఆధ్యాత్మిక చింతనను ప్రేరేపించడంలో భాగవత సేవా ట్రస్ట్ అందిస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణగాన సభ అధ్యక్షులు పద్మభూషణ్ డా.నల్లి కుప్పుస్వామిచెట్టి, కార్యదర్శి వై.ప్రభు, భాగవత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఉడయలూరు డా.కె.కళ్యాణరామ భాగవతార్, ఇంటగ్రేటర్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ, సీఈవో శ్రీరామ్ వైద్యనాథన్, నామ సంకీర్తన ఫెస్టివల్ ప్యాట్రన్ జి.సుందరేశన్, కన్వీనర్ వి.గోపాలకృష్ణన్, భాగవతార్లు, సంగీత విద్వాంసులు, కళాకారులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్ షోలకు నిబంధనల వ్యవహారం

- హైకోర్టు తీర్పు రిజర్వ్

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల రోడ్ షోలకు మార్గదర్శకాలు రూపొందించాలనే కేసులో మద్రాసు హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. కరూర్‌లో సెప్టెంబరు 27వ తేది తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షులు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట నెలకొని 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో, రాజకీయ పార్టీలు నిర్వహించే రోడ్ షోలకు మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు విచారణకు వచ్చిన సమయంలో, రోడ్ షోల అనుమతులకు సంబంధించిన ముసాయిదా మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసింది. ఈ విషయమై సూచనలు చేయాలని అన్నాడీఎంకే, టీవీకే, దేశీయ మక్కల్ కట్చి పార్టీలకు హైకోర్టు తెలిపింది. ఈ పిటిషన్‌పై మళ్లీ శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జి.అరుళ్‌మురుగన్‌లతో కూడిన ధర్మాసనం ముందు విచారణ జరిగింది. అన్నివర్గాలు లిఖితపూర్వకంగా సూచనలు చేసి నివేదికలు దాఖలు చేసినట్లు వివరించాయి. దానిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది.





అమ్మవారికి తిరువీధి ఉత్సవం

తిరుచానూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం ఘనంగా తిరువీధి ఉత్సవం జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తికి మధ్యాహ్నం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవిని తిరుచ్చిపై కొలువుదీరి రాత్రి తిరుమాడవీధుల్లో ఊరేగించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠ స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు

పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా పదిరోజులుగా ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో శనివారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

నేడు ఎస్వీయూలో 'అన్వేషణ్'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలోని సెనేట్ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు 'అన్వేషణ్-2025' కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థులకు రీసెర్చ్ పేపర్, పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్, ఇన్నోవేషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డీన్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

సర్వ దర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం

హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,548

తలనీలాలు సమర్పించినవారు: 25,781

వెటర్నరీ వర్సిటీ పాలకమండలి ఎప్పటికో?

రెండేళ్లు గడుస్తున్నా నియామకం లేదు ● వీసీ నుంచి అధికారుల వరకు ఇన్‌చార్జులే

తిరుపతిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీలో రెండేళ్లుగా రెగ్యులర్ పాలకమండలి(ఈసీ)ని నియమించలేదు. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో ఈసీసభ్యుల పదవీకాలం ముగిసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. దీంతో 2023 అక్టోబరు నుంచి వర్సిటీకి పూర్తిస్థాయి పాలకమండలి లేదు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా డాక్టర్ పద్మనాభరెడ్డిని తిరిగి రెండోదఫా వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో అప్పట్లో కొందరు ప్రొఫెసర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. యూజీసీ నియమ, నిబంధన ప్రకారం చట్టసవరణ(అమెండ్‌మెంట్) చేసి వీసీ నియామక నోటిఫికేషన్‌ని జారీ చేయాలని న్యాయస్థానం తీర్పునివ్వడంతో ఆయన నియామకానికి బ్రేక్‌పడింది. ఆ క్రమంలోనే 2023 డిసెంబరు నెలాఖరులో ఐసీఏఆర్‌కి చెందిన ఓ ఎక్స్‌అఫిషియో సభ్యుడు పదవీవిరమణ చేశారు. అప్పట్నుంచి వర్సిటీకి ఎక్స్‌అఫిషియో, పూర్తిస్థాయి పాలకమండలి(ఫుల్‌బోర్డు), రెగ్యులర్ వీసీని నియమించలేదు. గతనెల 28న వర్సిటీలో 253 టీచింగ్ ఖాళీ పోస్టుల (81బ్యాక్‌లాగ్ ఖాళీలతోపాటు) భర్తీకి అనుమతిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



వీటిని భర్తీ చేయాలంటే బోర్డు అనుమతి తీసుకోవాలి. అయితే వర్సిటీలో ఫుల్‌బోర్డు లేకపోవడం, న్యాయస్థానంలో పలు కేసులు పెండింగ్‌లో ఉండడంతో ఈ పోస్టులను భర్తీ చేస్తారా లేదా అన్న అయోమయంలో అధ్యాపకులున్నారు. ఈనేపథ్యంలో వర్సిటీకి కొత్తపాలకమండలి నియామకం ఎపుడు ఉంటుందనేది చర్చగా మారింది.

అక్కడందరూ ఇన్‌చార్జులే

వర్సిటీలో వీసీ నుంచి యూనివర్సిటీ ఆఫీసర్ల వరకూ అందరూ ఇన్‌చార్జీలుగానే వ్యవహరిస్తున్నారు. 2024 జూలై 19 నుంచి ప్రొఫెసర్ జేవీరమణ ఇన్‌చార్జి వీసీగా ఉన్నారు. గతనెలలో ముగ్గురు రెగ్యులర్ యూనివర్సిటీ ఆఫీసర్ల మూడేళ్ల పదవీకాలం ముగిసింది. దీంతో ఇప్పుడు వీసీ, రిజిస్ట్రార్, వెటర్నరీసైన్స్ డీన్, డీఆర్, డీఈ, సీవోఈ, కంప్ట్రోలర్, డెయిరీడీన్ పోస్టులలో తాత్కాలికంగా ఇన్‌చార్జులే ఉన్నారు. దీంతో ఉద్యోగుల సర్వీస్‌మేటర్స్, ఫైనాన్షియల్ అప్రూవల్స్ వంటి సమస్యలతో ఉన్నతాధికారవర్గాలు సతమతమవుతున్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగుల, సీఏఎస్ అధ్యాపకుల పదోన్నతులు నిలిచిపోయాయి. రెండు కాన్వొకేషన్లు పెండింగ్‌లో ఉండడంతో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఒరిజనల్ డిగ్రీల కోసం ఎదురు చూస్తున్నారు. తాత్కాలిక ఇన్‌చార్జులైన అధికారులు నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితితో అజమాయిషీ, పర్యవేక్షణ కొరవడి వర్సిటీ పాలనగాడి తప్పుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వందకు చేరిన కోర్టు కేసులు

వర్సిటీకి సంబంధించి వంద కోర్టు కేసుల వరకూ పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. వీటిలో పలువురు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కేసులే ఎక్కువగా ఉన్నాయని తెలిసింది. గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటివరకు వర్సిటీ ఉన్నతాధికారవర్గాలు, ఉద్యోగుల మధ్య సమన్వయం లేక చిన్నాచితక సమస్యల పరిష్కారానికి కూడా ఉద్యోగులు, బాధితులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

తిరుమలకు పూర్తిగా విద్యుత్ బస్సులు

దశలవారీగా డీజల్, పెట్రోల్ ట్యాక్సీలు, టీటీడీ అద్దెవాహనాల రద్దు ● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో పూర్తిగా విద్యుత్ వాహనాలనే వినియోగంలోకి తీసుకురావడానికి విస్తృత చర్యలు చేపట్టినట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో శుక్రవారం కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, ఆర్టీసీ, టీటీడీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పవిత్రత, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని పాత డీజిల్, పెట్రోల్ వాహనాల వినియోగాన్ని క్రమంగా రద్దు చేయనున్నట్టు వివరించారు. తొలిగా తిరుపతి, తిరుమల మధ్య పూర్తిగా విద్యుత్ బస్సులు మాత్రమే నడిచే ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. తిరుమలలో నడిచే ట్యాక్సీలు, టీటీడీ అద్దె వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలను దశలవారీగా భర్తీ చేయనున్నట్టు చెప్పారు. త్వరలో జరుగనున్న టీటీడీ బోర్డు సమావేశంలో ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ సీనియర్ కన్సల్టెంట్ ప్రతినిధి కునాల్ జోషి వివిధ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో టీటీడీ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, వీజీవో సురేంద్ర, ఐటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు నాయుడు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

లింగ వివక్షను రూపుమాపాలి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ చైతన్యంతో ముందుకు వచ్చి లింగ వివక్షతను నిర్మూలించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాత్రి అంతర్జాతీయ మహిళలపై హింసవ్యతిరేక దినం సందర్భంగా నయీ చేతన4.0 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెలరోజులు జెండర్ సమానత్వ ప్రచారంనిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు శోభన్‌బాబు, సుశీలాదేవి, వసంతబాయి, శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ నారావారిపల్లె పెండింగ్‌పనులు పూర్తి చేయాలి

స్వర్ణనారావారిపల్లె అభివృద్ధికి సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి తోపాటు ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రకృతి వ్యవసాయం, అనిమల్ హాస్టల్, సబ్‌స్టేషన్, రంగంపేట స్కూల్ నిర్మాణం, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసుకోకుంటే కార్డుల రద్దు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంకా ఈకేవైసీ చేసుకోలేదా? అలాగైతే రేషన్ కార్డులు రద్దవుతాయి. ఈ నెలాఖరుకు గడువు ఉంది. జిల్లాలో 5,87,001 కార్డులున్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు 70 వేల వరకు ఈకేవైసీ చేసుకోలేదని తెలిసింది. వీళ్లు ఏ మాత్రం ఈకేవైసీ చేసుకోకుంటే ఈనెలాఖరుకు రేషన్ కార్డులు రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక, రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ఉండడానికి ఇప్పటికే క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు పంపిణీ చేసింది. ఇందులోనూ ఇప్పటి వరకు దాదాపు 61,203 కార్డులు సచివాలయ సిబ్బంది వద్దే ఉన్నట్లు సమాచారం.

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేశాం



● జీఎం అమరేంద్ర రెడ్డి

తిరుపతి(సెంట్రల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టెలికం జిల్లా (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో గడిచిన నాలుగేళ్లలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా నెట్‌వర్క్‌ను బలోపేతం చేశామని బీఎస్ ఎన్ఎల్ జీఎం సి.అమరేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ జిల్లాలో ఫైబర్ నెట్‌వర్క్ వినియోగ దారులు 30 వేల మందికిపైగా ఉన్నారని తెలిపారు. వారి సేవలకు అంతరాయం లేకుండా నెట్‌వర్క్‌ను సరిదిద్దామని చెప్పారు. కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామన్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా జిల్లాకు మరో 75 టవర్లు వస్తాయని చెప్పారు. దీంతో సెల్‌ఫోన్ల సేవలు మరింత మెరుగుపడతాయన్నారు. చిత్తూరు, మదనపల్లె, పలమనేరు, పీలేరు, పుత్తూరు, వాల్మీకిపురం, పాకాల నుంచి తిరుపతి టెలికం జిల్లా కేంద్రానికి 10జీ స్పెక్ట్రంను 100జీకి పెంచామన్నారు. దీంతో ఇంటర్నెట్ వాడకం 2200 టెరాబైట్ పెరిగిందన్నారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరింప జేశామన్నారు.

విశాఖకు గూగుల్ పెద్ద గేమ్ ఛేంజర్

● ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



శ్రీకాంత్, గంటా శ్రీనివాసరావు, అశోక్ - జస్టిస్ ఏవీ శేషసాయి

తిరుమల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంకు గూగుల్ సంస్థ రావడంతో పెద్ద గేమ్ ఛేంజర్‌గా మారబోతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సినీనటులు శ్రీకాంత్, అశోక్‌తో కలిసి శుక్రవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, గతంలో మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు అద్భుతమైన మార్పులు జరిగాయని గుర్తు చేశారు. సైబరాబాద్ వంటి నగరం ఏర్పాటు కావడంలో మైక్రోసాఫ్ట్ కీలకంగా వ్యవహరించిందన్నారు. ఇదే తరహాలో గూగుల్ రాకతో విశాఖపట్నం కూడా ప్రపంచగుర్తింపు నగరంగా అభివృద్ధి చెందబోతోందన్నారు. రిలయన్స్, టీసీఎస్ వంటి అనేక సంస్థలు విశాఖవైపు చూస్తున్నాయన్నారు. కాగా, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

జీఎస్టీ ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలి

మెడికల్ డీలర్లను ఆదేశించిన జీఎస్టీ సంయుక్త కమిషనర్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మెడికల్స్‌పై ప్రభుత్వం జీఎస్టీ 2.0 తగ్గించిన ప్రయోజనాన్ని వినియోగదారులకుతప్పనిసరిగా అందించాలని చిత్తూరు డివిజన్ రాష్ట్ర పన్నుల సంయుక్త కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి వ్యాపారులకు స్పష్టం చేవారు. శుక్రవారం ఆయన డ్రగ్స్, మెడికల్ ఏజెన్సీల హోల్‌సేల్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, రీటైలర్లతో తిరుపతి కమర్షియల్‌టాక్స్ కాంప్లెక్స్‌లో సమావేశమయ్యారు. జీఎస్టీ అమలు ప్రక్రియలో వినియోగదారులకు అందాల్సిన ప్రయోజనాలను అందజేయకుంటే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త జీఎస్టీ రేట్ల అమలుపట్ల ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కంపోజిషన్ పన్ను చెల్లింపుదారులు రెగ్యులర్ కేటగిరీకి మార్చాల్సిన అవసరం, ప్రొఫెషన్ టాక్స్ చెల్లింపు తప్పనిసరి అని, రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని, రిటర్న్‌లను సమయానికి దాఖలు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరత్న, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సుబ్బరామగుప్త, ప్రతినిధులు నరసింహారెడ్డి, కుమార్, శశి, శివ తదితరులు పాల్గొన్నారు.

కాసులిస్తే కానీ కదలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు!

ఉచితం మాటున డ్రైవర్ల చేతివాటం ● ప్రసూతి ఆస్పత్రిలో బాలింతల అవస్థలు

● పిచ్చాటూరుకు చెందిన ధనలక్ష్మి మూడు రోజుల కిందట ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్నారు. శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ఇంటికి వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని అడగ్గా రూ.3 వేల వరకు డిమాండ్ చేశారు. చివరకు రూ.2 వేలకు బేరం కుదుర్చుకుని వెళ్లారు.

● రైల్వేకోడూరుకు చెందిన రేణుక శుక్రవారం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం కోసం డ్రైవర్‌ను సంప్రదించారు. మీది వేరే జిల్లా వస్తుందని అక్కడ వరకు ఉచితంగా రావడం కుదరదని చెప్పారు. ప్రైవేటు వాహనంలో వెళ్లాలంటే కనీసం రూ. 8 వేలు అడగతారని, రూ.4 వేలు చెల్లిస్తే విడిచిపెడతామని చెప్పడంతో చివరకు రూ.3 వేలకు బేరం కుదుర్చుకొన్నారు.



ఆటోలో వెళుతున్న బాలింతలు.. షెడ్డులో ఉన్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

..ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల తర్వాత క్షేమంగా ఇంటికి చేర్చేలా ప్రభుత్వం తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 29 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రభుత్వం అందించింది. వీటిల్లో 19 తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి కేటాయించారు. ప్రసూతి ఆస్పత్రిలో సగటున రోజుకు 20 మందికి పైగా డిశ్చార్జి అవుతుంటారు. వీరిని ఉచితంగా ఇంటి వద్ద విడిచిపెట్టేందుకు అందుబాటులో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు ముందుగానే బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఈ వాహనాలు ఉచితంగా కదా అని ఎవరైనా అడిగితే వాహనాలు మాత్రమే ఉచితమని పెట్రోలు, వాహన శుభ్రత, టోల్‌గేట్లు ఇలా చెల్లించాలని చెప్పి ముందుగానే నగదు వసూళ్లు చేస్తున్నారు. అంత ఇచ్చుకోలేని వారు ఆటోలను, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు షెడ్డులోఉన్నా బేరం కుదరకుంటే తీయడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో ప్రవేటు వాహనాల్లో ఇళ్లకు వెళుతున్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు పూర్తిగా ఉచితమని, ఎవరైనా డబ్బు అడిగితే ఫిర్యాదు చేయాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ చెప్పారు. ఎవరైనా ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

వేర్వేరు ప్రాంతాల మధ్య 41 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి):ప్రయాణికుల డిమాండ్ మేరకు 41 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. డిసెంబర్ 1నుంచి మార్చి 30 వరకు (సోమ)చర్లపల్లి-షాలిమార్(07225) 18 ట్రిప్పులు, డిసెంబర్ 2నుంచి మార్చి31 వరకు(మంగళ) షాలిమార్-చర్లపల్లి(07226) 18 ట్రిప్పులు,డిసెంబర్ 2 నుంచి 9వరకు(మంగళ) రామేశ్వరం-తిరుపతి(06080) 2ట్రిప్పులు. డిసెంబర్3నుంచి 10వరకు (బుధ) తిరుపతి - రామేశ్వరం (06079) 2ట్రిప్పులు, నవంబర్29 శనివారం ఛప్రా-ఎంజీఆర్ చెన్నై (05081) మధ్య ప్రత్యేక రైలు నడుస్తుందని తెలిపారు.

భానుప్రకాష్‌రెడ్డికి భారత్ గౌరవ్ అవార్డు



తిరుపతి(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి భారత్ గౌరవ్ అవార్డు లభించింది. ధార్మిక, సమాజ సేవా కార్యక్రమాలు చేసిన వారికి భారత్ గౌరవ్ సంస్థ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఈ క్రమంలో 2025వ సంవత్సరానికి భానుప్రకాష్‌రెడ్డిని ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిన్న జీయర్ స్వామి చేతులమీదుగా ఆయన అవార్డును అందుకున్నారు.

అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో రెండు నెలలు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్డుల గడువు ఆదివారంతో ముగుస్తుందన్నారు.

కుటుంబ కలహాలతోనే

తిరుమలలో ఆత్మహత్యాయత్నం

● పరిస్థితి విషమం



గణేష్

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం ఆత్మహత్యకు యత్నించిన గణేశ్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. ఆర్బీ సెంటర్ వద్ద బటన్ కట్టర్‌తో పొట్ట, గొంతు కోసుకుని, కడుపులోని పేగులను సైతం బయటకు లాగి ముక్కలు చేసి కుప్పకూలిపోయాడు. స్విమ్స్‌లో శుక్రవారం ఉదయం స్పృహలోకి వచ్చాడు. చెన్నైకి చెందిన గణేశ్ భార్య ఇందిరకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. కుటుంబ కలహాలతో గణేశ్ 15 రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. మానసిక పరిస్థితి కూడా బాగాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఓజిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ గూడూరు కోర్టు న్యాయమూర్తి కె.నాగపవన్ తీర్పు ఇచ్చారు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.... నెల్లూరు జిల్లా రాపూరు మండలం వేపినాపి గ్రామానికి చెందిన మోడిబోయిన వెంకటేశ్వర్లు మద్యానికి బానిసై తరచుగా భార్యను కొడుతుండేవాడు. దీంతో ఆమె తన పిల్లలతో కలిసి ఐదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి ఓజిలి మండలం కారూరులో తన తాత ఇనుగుంట శ్రీనివాసులు వద్ద ఉంటోంది. వెంకటేశ్వర్లు తరచూ కారూరుకు వెళ్లి భార్య పిల్లలను పంపమని శ్రీనివాసులతో గొడవపడుతుండేవాడు. ఎంతకీ తన భార్యపిల్లలను పంపకపోవడంతో శ్రీనివాసులును హత్య చేసేందుకు వెంకటేశ్వర్లు పథకం పన్నాడు. 2019 జూన్ 24వ తేదీ రాత్రి 7:30 గంటల సమయంలో కారూరులో ఇంటి బయట నిద్రపోతున్న శ్రీనివాసులును గొడ్డలితో మెడమీద నరికి చంపేశాడు. అప్పటి సీఐ నరసింహారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కోర్టులో నేరం రుజువుకావడంతో నిందితుడు వెంకటేశ్వర్లుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుందరయ్య యాదవ్ కేసు వాదించారు. నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ మల్లిఖార్జున్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులును జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

సైకిల్‌కు పంక్చర్ వేయలేదని దాడి

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

తడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌కు పంక్చర్ వేయలేదని దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన సహమద్ ఆలీ తడ మండలం చేనిగుంటలో కోగిలి రామయ్యకు చెందిన ఖాళీ స్థలంలో పంక్చర్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. గురువారం చేనిగుంట దళితవాడకు చెందిన మీజూరు ప్రతాప్ సైకిల్ తీసుకువచ్చి పంక్చర్ వేయాలని కోరాడు. సైకిళ్లకు పంక్చర్ వేయలేనని సహమద్ ఆలీ చెప్పినా వినకుండా గొడవకు దిగాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన స్థల యజమాని రామయ్య సర్దిచెప్పడానికి యత్నించాడు. ఆగ్రహించిన ప్రతాప్ రాయితో సహమద్ ఆలీ, రామయ్యపై దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు క్షతగాత్రులను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సహమద్‌ఆలీ(47) శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు అదనపు ఎస్పీ కులశేఖర్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం విల్లిపురానికి చెందిన ముట్టియన్ ఆండీ 2019లో నాగపట్ల ఈస్ట్ బీట్ చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పట్లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి విచారణకు హాజరవుతున్నాడు. ఇదే కేసును ఇటీవల తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు మార్చడంతో విచారణ మొదలైంది. ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రభుత్వం తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, కోర్టు లైజన్ అధికారి, కోర్టు కానిస్టేబుల్ కలిసి సాక్ష్యాధారాలను పటిష్ఠంగా హాజరు పరచి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు.